క్లుప్తంగా

ముత్యాలమ్మ తల్లికి బోనం సమర్పణ



మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో తలపై బోనాలు ధరించి, గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా దేవాలయానికి తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు చేపట్టారు. విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. కుంకుమ బండ్లు ఏర్పాటు చేసి, గ్రామంలో ఊరేగించారు. బంధుమిత్రులు రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ




సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారికి ఆశ్వయుజమాస పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం శనివారం విశేషంగా నిర్వహించారు. అనంతరం శ్రీమాన్ శ్రీచిత్రకవి శ్యాము ఆచార్య రామానుజదాసన్ గరుడాళ్వార్ మండపంలో వేంచేసిన గరుడాళ్వార్‌మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారు గరుడవాహనంపై పట్టణంలోని రైల్వేస్టేషన్ పురవీధుల్లో దర్శనమిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బంతికి గిరాకీ



నకరికల్లు: బంతి సాగు రైతులకు ప్రస్తుత ధర ఆశాజనకంగా మారింది. అయ్యప్ప మాలధారులు అధికంగా ఉండడంతో బంతిపూలకు భారీగా డిమాండ్ పెరిగింది. మండలంలోని చల్లగుండ్ల, చీమలమర్రి తదితర గ్రామాలలో రైతులు బంతి సాగు చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించిన రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలో బంతిసాగు చేస్తున్న రైతులు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి మొక్క రూ.3 చొప్పున బంతినారు దిగుమతి చేసుకుంటున్నారు. భారీగా పెట్టుబడులు లేకపోవడం, తక్కువ నీటితో పంట పండడంతోపాటు 40 రోజులకే తొలికాపు వస్తుండడంతో రైతుల ఆదాయం మెరుగుపడుతుంది. దాదాపు రెండు నెలలకుపైగా పంట వస్తుండడంతో నిత్య ఆదాయ వనరుగా మారిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాటుసారా కాచే సామగ్రి స్వాధీనం



అచ్చంపేట: ఇటీవల కాలంలో మండలంలోని మాదిపాడు, గింజుపల్లి, జడపల్లితండా, కంచుబోడుతండా, సంద్ర తండాల పరిధిలోని అడవులలో కొంతమంది నాటు సారా కాస్తూ, పోలీసులు దాడులు నిర్వహించే సమయంలో పరారవ్వగా నాటుసారా కాయడానికి ఉపయోగించే పెద్ద పెద్ద స్టీల్ బిందెలు, డ్రమ్ములు తదితర వస్తువులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం అవి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి నిరసన



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు ఆదివారం నిరసన తెలిపారు. కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై 14 మంది దుండగులు దాడి చేసి గాయపరిచారన్నారు. నిరసనలో భాగంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నిరసనలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు భాస్కరరావు, ఎంబీకే సాహెబ్, జవహర్, ఎస్‌ఎంయూ నాయకులు నాగేశ్వరరావు, సుధాకరరావు, జిల్లా నాయకులు రమణారెడ్డి, యలమంద తదితరులు పాల్గొన్నారు.

స్వైర విహారం చేస్తున్న కుక్కలు, కోతులు

ఆందోళన చెందుతున్న గ్రామస్తులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని వివిధ కాలనీలలో కొన్ని రోజులుగా కుక్కలు, కోతులు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ఎగబడి గాయపరుస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చిన కుక్కలు సుమారు 10 నుంచి 15 పగలు, రాత్రి అనే తేడా లేకుండా మూకుమ్మడిగా వెంటబడి కరుస్తున్నాయి. ఇప్పటికి ఫాతిమానగర్, ఎస్సీ కాలనీ, ఆరోగ్యపురం, రేగులమాన్యంకాలనీ, పిచుకల గడ్డ తదితర కాలనీలలో సుమారు 50 కుక్కలు, సుమారు10 నుంచి 15 కోతులు వరకు సంచరిస్తున్నాయని గ్రామ పంచాయతీ వారి దృష్టికి తీసుకువెళ్లినట్లు పలువురు గ్రామస్తులు తెలిపారు. కోతులు ఇళ్లలోకి వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గ్రామంలో పిల్లలే కాకుండా పెద్దలు కూడా ఒంటరిగా పగలు సైతం ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒకేసారి 10,12 కుక్కలు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయని, ఎటువైపు నుంచి వచ్చి కరుస్తాయో కూడా తెలియడం లేదని వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిపై కూడా కుక్కలు గుంపుగా వెంటబడుతున్నాయి. గ్రామంలోని పలు కాలనీల సమీపంలో ఉన్న పొలాలలో సైతం కుక్కలు విపరీతంగా తిరుగుతూ పొలాలకు వెళ్లిన కూలీలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్క కాటుకు గురై స్థానిక పీహెచ్‌సీకి వచ్చి కుక్కకాటు ఇంజక్షన్‌లు వేయించుకుంటున్నారు. ఇప్పటికైన గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి కుక్కలను, కోతులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రెంటచింతలలో గుంపుగా ఉన్న కుక్కలు (ఇన్‌సెట్) ఇంటి ముందు సంచరిస్తున్న కోతి

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

దాచేపల్లి : మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆంధ్రా సిమెంట్ ప్రాంగణంలో సాగర్ సిమెంట్ ఫౌండర్ చైర్మన్ సమ్మిరెడ్డి వీరారెడ్డి స్మారక స్కాలర్‌షిప్‌లు ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.20వేలు, ద్వితీయ స్థానానికి రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10వేల నగదు, మెమెంటోలను 27మంది విద్యార్థులకు ఎంఈవో రాజకుమారి, ఫ్యాక్టరీ హెడ్ పి.బిక్షారెడ్డి చేతుల మీదుగా అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుందని, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో పాటుగా తమవంతు సహకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందిస్తామని ఫ్యాక్టరీ హెడ్ బిక్షారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎంలు ఎంవీ సత్యసాయి, సుబ్బారెడ్డి, రామకృష్ణా, సీఎస్‌వో కొండారెడ్డి, వీర ప్రకాష్, ఫ్యాక్టరీ ప్రతినిధులు రామకృష్ణా, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగరమాత పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

తెలంగాణ సరిహద్దు మాదిపాడులో పోలీస్ నిఘా

అచ్చంపేట: తెలంగాణాలో జరగబోయే 2023 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన మాదిపాడు వద్ద నగదు, మద్యం, విలువైన వస్తువులు అక్రమ రవాణా జరుగకుండా ఆదివారం పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెదకూరపాడు సీఐ వీరాస్వామి మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సరిహద్దులో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణాలో ఎన్నికలు అయిపోయేంతవరకు పులిచింతల ప్రాజెక్టుపై నుంచి గాని, బల్లకట్టుపై నుంచి గాని తెలంగాణ రాష్ట్రానికి ఏ విధమైన వస్తువులు రవాణా చేయడానికి వీలు లేదని, అత్యవసర పరిస్థితులలో తీసుకెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా పోలీసు వారి అనుమతులు తీసుకోవాలన్నారు. మాదిపాడు నుంచి బైకులపై, కార్లలో మద్యం, డబ్బు ఇతర ఆకర్షణీయమైన వస్తువులు ఏమైనా తీసుకెళుతూ పట్టుబడితే నాన్‌బెయిలబుల్ కేసులు బుక్‌చేసి అరెస్ట్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పులిచింతల ప్రాజెక్టు, బల్లకట్టు, పడవరేవుల వద్ద 24/7 పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాదిపాడు, కంచుబోడుతండా, గింజుపల్లి తదితర గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ, అచ్చంపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాదిపాడులో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ వీరాస్వామి, ఎస్ఐ మణికృష్ణ తదితరులు

బీజేపీ విధానాలను వ్యతిరేకించండి

ప్రజా మేనిఫెస్టో పోస్టర్ల ఆవిష్కరణలో సీపీఎం

క్రోసూరు: ఆంధ్రాకి ద్రోహం చేసిన బీజేపీకి రాష్ట్ర రాజకీయపార్టీలు అనుకూలంగా వ్యవహరించటం దుర్మార్గమని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి బి.విజయ్‌కుమార్ అన్నారు. సీపీఎం పెదకూరపాడు నియోజకవర్గంలోని పార్టీ సభ్యులు సానుభూతిపరుల జనరల్‌బాడీ సమావేశంలో బి.సూరిబాబు అధ్యక్షతన స్థానిక ఆమంచి విజ్ఞాన భవనంలో ఆదివారం జరిగింది. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రానికి తెలుగు ప్రజలకు మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. విభజన హామీలు ఏపీ అమలు చేయకుండా పోలవరం నిర్మాణాన్ని చేపట్టకుండా, విశాఖ ఉక్కును అమ్మాలని చూడటం, తెలుగు జాతి ప్రజలను మోసం చేయటమేనని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా చేస్తూ పట్టీ పట్టనట్లు వ్యవహిరించడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. భారతదేశంలో నిరుద్యోగాన్ని పారదోలటానికి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానం చేసి, పెద్ద నోట్లు రద్దు దేశంలో కోట్లాది మంది ఉపాధి లేకుండా చేయటానికి కారణమైందన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని దేశ ప్రజానీకం వ్యతిరేకించకుండా ఉండటానికి దేశంలో అన్నదమ్ముల్లాగా జీవిస్తున్న వారి మధ్య కుల మత భావనలను రెచ్చగొట్టి చిచ్చుపెట్టే కుట్రలు చేస్తుందన్నారు. ఇటువంటి దుర్మార్గమైన బీజేపీ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. అవకాశవాద పార్టీల వైఖరికి ప్రత్యామ్నాయంగా సీపీఎం ప్రజా మేనిఫెస్టో ఆధారంగా సమగ్ర అభివృద్ధి జరగాలని రాష్ట్ర వ్యాప్తంగా మూడు చోట్ల నుంచి బస్సు యాత్రలు నిర్వహిస్తుందన్నారు. నవంబర్ 7వ తేదీ సత్తెనపల్లిలో, 15వ తేదీ విజయవాడలో జరగనున్న బహిరంగ సభల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజా మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు పార్టీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



నేటి రైతులే రేపటి శాస్త్రవేత్తలు

నరసరావుపేట రూరల్: భూసారాన్ని పెంపొందించుకొని ఆరోగ్యకరమైన పంటలు పండించటంలో రైతులు నైపుణ్యం సాధించాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం రైతు శాస్త్రవేత్తల శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో అనుభవం ఉండి ఉన్నత విద్యను అభ్యసించేందుకు రైతు సాధికార సంస్థ అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతు శాస్త్రవేత్తలు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ఆరోగ్యకరమైన పంటలను పండించటంలో నైపుణ్యం సాధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా డీపీపీ భవానిరాజ్, సుస్మిత, రైతు సాధికారసంస్థ ప్రతినిధులు రమ్య, పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి ఎంపికైన ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

వెల్దుర్తి మండల ఇన్‌చార్జిగా గాలి మహాలక్ష్మి



మాచర్ల: పట్టణంలోని బహుజన మహిళా కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు జెట్టిపాలెం వెంకటేష్ ఆధ్వర్యంలో వెల్దుర్తి మండలానికి చెందిన గాలి మహాలక్ష్మిని వెల్దుర్తి మండల ఇన్‌చార్జిగా నియమించి నియామక పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బహుజన మహిళలను అన్ని వర్గాలను అభివృద్ధి చేయటానికి బహుజన మహిళా సంఘం పనిచేస్తుందని అన్నారు. నియామకపత్రాలు అందుకున్న ప్రతి మండల ఇన్‌చార్జి పూర్తిస్థాయిలో పనిచేసి బహుజనుల హక్కుల పరిరక్షణకు పనిచేయాలని కోరారు. పలు సంక్షేమ పథకాలు మహిళలు ఉపయోగించుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో బహుజన మహిళా సంఘం సభ్యులు బాణావత్ లక్ష్మీబాయి, రామలక్ష్మమ్మ, మూడావత్ సోమ్లిబాయి, బాణావత్ వసంతబాయి, లక్కపోగు కమలమ్మ, కంభంపాటి మేరమ్మ, వరలక్ష్మి తదితరులున్నారు.

కృష్ణప్రసాద్‌కు రీ సర్వే విధులు

కారెంపూడి: మండల ఇన్‌చార్జి ఆర్ఐగా, కారెంపూడి వీఆర్వోగా పని చేస్తున్న ఎం కృష్ణప్రసాద్‌కు మండల రీ సర్వే పనులు అలాగే ఎన్నికలకు సంబంధించిన విధులను కేటాయిస్తూ తహసీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ ఉత్తర్వులిచ్చారు. పెదకొదమగుండ్ల వీఆర్వోగా పనిచేస్తున్న బి.శివరామకృష్ణకు కారెంపూడి వీఆర్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రీ సర్వే పనులు ఎన్నికల విధులు తప్పించి మిగిలిన బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఇదిలా ఉంటే నరమాలపాడు గ్రామ ఇన్‌చార్జి వీఆర్వోగా కూడా కృష్ణప్రసాద్ కొనసాగుతారని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

నరసరావుపేట టౌన్: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వనటౌన్ సీఐ అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన గోరె మల్లేశ్వరమ్మ ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తున్నట్లు సీఐ తెలిపారు.

సమాజ సేవకు చేయూత



చిలకలూరిపేట: సమాజసేవకు తమవంతు చేయూతనందించాలన్న ఆలోచన అభినందనీయమని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు ఇందిర చెప్పారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు, ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి దంపతులు అందించిన ఆర్థిక సహాయంతో పేద మహిళ సునీతకు కుట్టుమిషన్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ క్లబ్ సభ్యులు అందించిన ఆర్థిక సహాయాన్ని ఉపయోగించుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు గట్టు సరోజిని, యూ.రమాదేవి, ఎస్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నూతన ప్రార్థన మందిరం ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): పవిత్రమైన ప్రార్థన మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొనడం తన అదృష్టమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం చెరుకుంపాలెం గ్రామంలో నూతనంగా నిర్మాణమైన చర్చిని ఆయన శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడిచి శాంతియుతంగా జీవించాలని అన్నారు. మన ప్రాంతంలోని ప్రతి కుటుంబంపై ఏసుక్రీస్తు దీవెనలు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



నిషేధిత మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

సీఐ దార్ల జయకుమార్

రెంటచింతల: ప్రభుత్వం నిషేధించిన నాటుసారాను గ్రామాలలో కాచిన, అమ్మిన, తెలంగాణ మద్యం విక్రయించిన, తరలించిన అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ హెచ్చరించారు. ఆదివారం వేకువజామున 5 గంటలకు మండలంలోని మల్లవరం గ్రామంలో సిఐ జయకుమార్ రెంటచింతల, దుర్గి ఎస్ఐలు సామెల్ రాజీవ్‌కుమార్, శివ, పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలోని నివాసాలు, చొప్పదొడ్లు, వరిగడ్డి వాములలో, నివాస సమీప పొలాలలో, ముళ్లపొదలు, పాడుబడిన నివాసాలలో నాటుసారా, తెలంగాణ మద్యం, నిషేధించబడిన వస్తువుల కోసం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం సీఐ దార్ల జయకుమార్ గ్రామస్తులతో మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడం వలన ఆ కుటుంబాలు ఎంతో నష్టపోతాయన్నారు. గ్రామంలో నాటుసారా కాచిన, అమ్మిన, తెలంగాణ మద్యం విక్రయించిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. పోలీసులకు సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. నాటుసారా కారణంగా ప్రశాంతంగా ఉన్న కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.



తనిఖీలు చేస్తున్న సీఐ దార్ల జయకుమార్, ఎస్ఐలు సామెల్ రాజీవ్‌కుమార్, శివ

కొడుకును చిత్రహింసలు పెట్టిన మహిళపై సుమోటోకు రంగం సిద్ధం

మాచర్ల: పట్టణంలోని ఓ మహిళ కన్న కొడుకును చిత్రహింసలు పెడుతున్న దృశ్యం సంవత్సరం తరువాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచర్లలోని వడ్డెరపాలెంలో నివాసముండే ఓ మహిళ ఒడిశాలో ఆర్మీలో పనిచేసే శంకర్‌ని వివాహం చేసుకుంది. వారిద్దరికి సంవత్సరంగా వివాదాలు పెరిగాయి. ఆ వివాదాల నేపథ్యంలో వారి కన్న కొడుకును చంపేందుకు తీవ్రంగా హింసించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ బాలుడు తీవ్రంగా గాయపడటంతో బాలుడి తండ్రి ఆవేదనకు గురయ్యాడు. బాలుడు ప్రణయ్ ఇప్పటికీ సురక్షితంగా ఉన్నాడు. అయినా కన్న కొడుకును కఠినంగా వేధించిన ఆమె, ఆమె తల్లి, ప్రియుడిపై ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాలల హక్కుల పరిరక్షణ కింద చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరుతూ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఘటన ఎక్కడ జరిగింది అనే విషయంపై పోలీసులు విచారిస్తున్నారు. ఘటనకు పాల్పడి ప్రియుడి కోసం బాలుడిని చిత్రహింసలు చేసిన మహిళపై సుమోటోగా పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పోలీసులను వివరణ కోరగా ఈ ఘటన ఒడిశా రాష్ట్రంలో జరిగిందని, కేసుకు కొన్ని సమస్యలున్నాయని, అయినా ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి వివరాలతో దర్యాప్తు చేసి బాలుడికి న్యాయం చేస్తామని చెప్పారు.

ప్రజా సంఘాల డిమాండ్ :

అక్రమ సంబంధం కలిగిన ఓ మహిళ చేసిన దారుణమైన ఘటన ఎంతో బాధాకరమని ప్రజా సంఘాలు ఆదివారం ఖండించాయి. దానికి కారణమైన మహిళను శిక్షించి చర్యలు తీసుకోవాలని జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు కోరారు. అదే విధంగా ప్రజా సంఘాల వారు నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు.



గాయాలపాలైన బాలుడు

చేతన ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

మాచర్ల: వెనుకబడిన మాచర్ల నియోజకవర్గంలో ప్రతి దివ్యాంగుడికి కృత్రిమ కాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ఎంతో అభినందనీయమని కేసీపీ సిమెంట్స్ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కేసీపీ ఫ్యాక్టరీ ఆవరణలోని పాత పాఠశాలలో ఏర్పాటు చేసిన చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ, రోటరీ క్లబ్, మాచర్ల, కేసీపీ వారు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవా సంఘాలు ఈ విధంగా దివ్యాంగులను ఆదుకునే విధంగా క్యాంపు ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమన్నారు. వైద్యులు, రోటేరియన్ డాక్టర్ రామకోటయ్య మాట్లాడుతూ పేదరికం ఎదుర్కొంటున్న వారికి ఎంతో మంది దివ్యాంగులకు చేయూతనిచ్చే విధంగా కృత్రిమ అవయవాలను చేతన ఫౌండేషన్ ట్రస్టు, రోటరీ, వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రతి దివ్యాంగుడికి కృత్రిమ కాలు కోసం శిబిరాలు ఏర్పాటు, రాబోయే కాలంలో చేయూతనిచ్చి సహకారమివ్వటం మంచి కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, చుండూరు సత్యనారాయణ, బచ్చు రాజ్‌కుమార్, చిన్ని సత్యనారాయణ, పందిరి నరసింహారావు, ముప్పవరపు నాగార్జున, కేసీపీ వాసు, చందోలు నాగేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా, శంకర్, చేతన ఫౌండేషన్ సభ్యులు ఎస్‌ఆర్‌ఐ చైర్మన్ వెనిగండ్ల రవికుమార్, అనిల్‌కుమార్, పి.రంగారావు, సీతారామయ్య, సాంబశివరావు, వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.



మాట్లాడుతున్న వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు చెన్నకేశవరావు

దూదేకుల ముస్లింల సింహ గర్జన

మాచర్ల: ఒక్కసారి మనలో మనం అంటూ దూదేకుల ముస్లింలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుమారు 100 వాహనాలలో గుంటూరులో జరిగే దూదేకుల ముస్లింల సింహ గర్జన కార్యక్రమానికి తరలివెళ్ళారు. పల్నాడు జిల్లా అధ్యక్షులు జానీబాషా, మాచర్ల నియోజకవర్గ అధ్యక్షులు సైద్ మస్తాన్ మీడియాతో మాట్లాడుతూ దేశ సమగ్రతకు, మత సామరస్యానికి నిజమైన భారతీయతకు తార్కాణమై, కొవ్వొత్తిలా కరిగిపోతున్న తమను ఆదరించే నాథుడే లేడా!? ఎన్నాళ్ళీ నిరాదరణ? ఎన్నాళ్ళీ నిరీక్షణ? అని ప్రశ్నించారు. మాచర్ల నియోజకవర్గం నుంచి వేలాది మంది నూర్‌బాషా సోదరులు తరలి వెళ్ళారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు, నూర్‌బాషా దూదేకుల ముస్లిం కులస్థులకు చట్ట సభలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఏ పార్టీ తమకు చట్ట సభలలో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజర్ బాదన్‌బాయ్, పల్నాడు టీడీ జానీ, న్యూ స్టార్ వలి, షఫీ, సుభాని, యాసిన్, జబ్బార్ మాస్టర్, నాయిట్ హుస్సేన్, పీర్ సాహెబ్, చాంద్ బాషా, షేక్ సైదా, మీరావలి, దుర్గి మండల అధ్యక్షుడు సంషుద్దీన్, రెంటచింతల మండల అధ్యక్షుడు చాంద్ బాషా, కారెంపూడి అధ్యక్షుడు షేక్ సైదా, నజీర్, వెల్దుర్తి మండల అధ్యక్షుడు బాషా పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సమీపాన ప్రభుత్వ భూమి ఎకరం స్థలంలో నూతనంగా రూ.4కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్ స్టేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధి నుంచి సబ్‌స్టేషను వరకు సన్‌పోల్స్ 45 విద్యుత్ స్తంభాల నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏఈ సంపెంగుల గాంధీ మాట్లాడుతూ నూతన సబ్‌స్టేషను పరిధిలో అనుసంధానం చేసే గ్రామాల్లో 200 విద్యుత్ స్తంభాలతో పాటు నూతనలైను పనులు ప్రారంభం అయ్యాయని, ఈ నెలఖారులోగా పూర్తి అవుతాయన్నారు. తదుపరి విద్యుత్ సబ్‌స్టేషనులో యంత్ర పరికరాలు ఏర్పాటు పనులు జరుగుతాయన్నారు. త్వరితగతిన పనులు పారదర్శకంగా పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు.



వేల్పూరులో నిర్మాణ దశలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషను